ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రంగారెడ్డి
5 జిల్లా వార్తలు
శుక్రవారం 10 అక్టోబరు 2025


ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు సూచనలు ఇస్తున్న కలెక్టర్

ఎన్నికల నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు

» కలెక్టర్ నారాయణరెడ్డి.. నామినేషన్ కేంద్రం పరిశీలన

కందుకూరు, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉండొద్దని కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఆదేశించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎన్నికల నామినేషన్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. అనంతరం రిటర్నింగ్ అధికారులకు పలు సూచనలు చేశారు. నామినేషన్ మొదలు కొని ఎన్నికలు పూర్తయ్యే వరకు అప్రమత్తంగా ఉండాలన్నారు.

మొదటి రోజు ఉత్సాహంగా..


లావణ్యకు బీఫాం ఇస్తున్న ఏనుగు జంగారెడ్డి, ఎస్ కృష్ణా నాయక్, బొక్క జంగారెడ్డి

కందుకూరు మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్‌ల స్వీకరణ కేంద్రంలో మొదటి రోజు గురువారం ఎంపీటీసీ స్థానాలకు నామినేషన్‌లు వేయడానికి ఉత్సాహంగా ముందుకు వచ్చారు. బీసీ రిజర్వేషన్లపై హైకోర్టులో గురువారం విచారణ ఉన్నప్పటికీ 16 ఎంపీటీసీ స్థానాలకు గాను 6 నామినేషన్‌లు దాఖలయ్యాయని మండల ఎన్నికల నిర్వహన అధికారి సరిత తెలిపారు. చిప్పలపల్లి, జైత్వారం, గూడూరు, నేదునూరు, పులిమామిడి, ఎంపీటీసీ స్థానాలకు కాంగ్రెస్ అభ్యర్థులు పొట్ట కుమార్, బైరు లావణ్య, చిలుకల పూర్ణిమ, ఎండి అఫ్జల్‌బేగ్, బుక్క పాండురంగారెడ్డిలు నామినేషన్‌లు వేశారని చెప్పారు. బాచుపల్లి నుంచి కె.కళమ్మ ఇండిపెండెంట్ అభ్యర్థిగా నామినేషన్ వేసినట్లు తెలిపారు. సీఐ సీతారాం నేతృత్వంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి మహేశ్వరం అడిషనల్ డీసీపీ సత్యానారాయణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎన్నికల నిర్వహనపట్ల ఆర్‌డీవో జగదీశ్వర్‌రెడ్డి ఎప్పటికప్పుడు సమాచారాన్ని సేకరించి జిల్లా ఎన్నికల అధికారులకు నివేదికలు పంపారు.

పంజగూడలో ఏటీసీ కేంద్రం తనిఖీ

మండలంలోని పంజగూడ రెవెన్యూలో రాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన ఏటీసీ(అడ్వాన్స్ టెక్నాలజీ) కేంద్రాన్ని కలెక్టర్ గురువారం తనిఖీ చేశారు. విద్యార్థులకు నైపుణ్య విద్యను అందించడానికి ప్రభుత్వం నిర్మించిన ఈ కేంద్రాన్ని ఇటీవల చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్‌డీవో జగదీశ్వర్‌రెడ్డి, ఏటీసీ కేంద్రం ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వి.లక్ష్మణ్‌లతో కలిసి భవనం గదులను, మిషనరీలను ఏర్పాటు చేసిన విధానాన్ని, శిక్షణ ఇవ్వడానికి నిర్మించిన హాల్‌లను పరిశీలించారు. తహసీల్దార్ కె.గోపాల్ ఏటీసీ కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.



ఉమ్మడి జిల్లా వర్కింగ్ చైర్మన్‌గా హరికృష్ణ

ఇబ్రహీంపట్నం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): బండ్లగూడ జాగీర్ మాజీ సర్పంచ్ గంగని హరికృష్ణను కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం ఉమ్మడి రంగారెడ్డి జిల్లా వర్కింగ్ చైర్మన్‌గా నియమిస్తూ టీపీసీసీ ఎస్సీ డిపార్ట్‌మెంట్ చైర్మన్ నగరిగారి ప్రీతం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు గురువారం ఆయనకు నియామకపత్రం అందజేశారు. కార్యక్రమంలో ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్ ముదిరాజ్, తెలంగాణ ఎస్సీ డిపార్టుమెంట్ వైస్ చైర్మన్ నరేందర్ ఉన్నారు.


జయకృష్ణను సత్కరిస్తున్న పరమేశ్

అసిస్టెంట్ ట్రెజరీ అధికారిగా జయకృష్ణ

ఇబ్రహీంపట్నం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం అసిస్టెంట్ ట్రెజరీ కార్యాలయ అధికారిగా జయకృష్ణ గురువారం బాధ్యతలు తీసుకున్నారు. గ్రూప్-1 ఫలితాల్లో ఆయన అసిస్టెంట్ ట్రెజరీ అధికారిగా ఉద్యోగం సాధించారు. కాగా ఆయనను పీఆర్టీయూ మండల శాఖ అధ్యక్షుడు వరకాల పరమేశ్ బృందం శాలువాతో సత్కరించింది. ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసించి ఈ స్థాయికి ఎదగడం ఎంతో గర్వంగా ఉందని పరమేశ్ అన్నారు. కార్యక్రమంలో ఏటీవో మంగారెడ్డి, ఎస్‌టీవో సంతోష్‌కుమార్ ఉన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్‌ను హైకోర్టు నిలిపివేయడంతో ఆశావహుల ఆశలు ఆవిరయ్యాయి. అలాగే బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ జారీ చేసిన జీవో 9పై కూడా స్టే విధించింది. దీంతో భవిష్యత్తులో ఎన్నికల నిర్వహణపై కూడా గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. కాగా, ఎన్నికల కమిషన్ సూచనల మేరకు గురువారం ఉదయం తొలి విడత ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల చేశారు. ఆ వెంటనే నామినేషన్ల స్వీకరణ సైతం ప్రారంభమైంది. అయితే సాయంత్రం కోర్టు తీర్పుతో పరిస్థితి తారుమారైంది. ఈ నేపథ్యంలో మళ్లీ ఎన్నికలు ఎప్పుడు ఉంటాయి? భవిష్యత్తులో అసలు ఎన్నికల్లో పోటీచేసే అవకాశం దక్కుతుందా? లేదా? అనే టెన్షన్‌లో ఆశావహులు ఉన్నారు.



ఆశలు ఆవిరి

హైకోర్టు తీర్పుతో ఆగిన స్థానిక ఎన్నికలు

డీలాపడిన ఆశావహులు
ఉత్కంఠ పరిస్థితుల్లోనూ పలువురు నామినేషన్లు
రంగారెడ్డి జిల్లాలో 8, వికారాబాద్‌లో ఒకటి దాఖలు
భవిష్యత్తుపై అయోమయంలో నేతలు



(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి) : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల అమలుకు సంబంధించి న్యాయస్థానాల్లో వివాదం నడుస్తున్న విషయం తెలిసిందే. బుధవారం దీనిపై విచారించిన హైకోర్టు గురువారానికి వాయిదా వేసింది. అయితే ఇదే సమయంలో తొలత ఎన్నికల నోటిఫికేషన్‌పై ఎలాంటి అభ్యంతరాలు చెప్పకపోవడంతో గురువారం ఉదయం 10:30 గంటలకు యథావిధిగా తొలి విడత జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు అధికారులు నోటిఫికేషన్ విడుదల చేశారు. రంగారెడ్డి జిల్లాలోని 10 జెడ్పీటీసీ, 110 ఎంపీటీసీ స్థానాలు, వికారాబాద్ జిల్లాలోని 11 జెడ్పీటీసీ, 115 ఎంపీటీసీ స్థానాలకు నోటిఫికేషన్ విడుదల చేశారు. అనంతరం నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. ఇందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు అధికారులు పకడ్బందీగా చేశారు. నామినేషన్లు స్వీకరించే కేంద్రాల్లో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. మరో వైపు కోర్టు తీర్పుపై

మిగతా 7వ పేజీలో...

అనుకున్నదొకటి... అయ్యిందొకటి

ఇప్పటికే కొందరు ఎన్నికల కోసం భారీగానే ఖర్చుచేయగా మరికొందరు ఎంతో కొంత ఖర్చు చేశారు. ఎన్నికల నిర్వహణపై కొంత ఉత్కంఠ నెలకొన్నప్పటికీ భవిష్యత్తుపై ఆశతోనే ఎన్నికలకు సిద్ధమై ఖర్చుకు వెనుకాడ లేదు. షెడ్యూల్ విడుదల కావడంతో ఆశావహులు ఎన్నికల కోసం డబ్బు కూడా సమకూర్చుకున్నారు. పల్లెల్లో ముందు నుంచే పట్టుకోసం ఖర్చుకు వెనుకాడలేదు. కొందరు ఎంపీటీసీ, సర్పంచ్ అభ్యర్థులు గడిచిన వారం రోజులుగా ప్రతి రోజూ సగటు రూ.40 నుంచి రూ.50వేల వరకు విందులు, వినోదాలకు ఖర్చు చేశారు. దసరా సందర్భంగా గ్రామాల్లో జరిగిన కార్యక్రమాలకు విరాళాలు సైతం ఇచ్చారు. తమ స్తోమత కొద్దీ కేడర్‌కు మందు పార్టీలు , విందులు ఇచ్చారు. కొందరైతే దసరాకు కేడర్‌ను విహార యాత్రలకు తీసుకువెళ్లారు. అయితే ఇప్పుడు తమ పరిస్థితి ఏమిటో వీరికి కూడా అర్థం కావడం లేదు. మళ్లీ ఎన్నికలు ఎప్పుడు ఉంటాయి? భవిష్యత్తులో అసలు ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం తమకు దక్కుతుందా? లేదా అనే టెన్షన్‌తో ఉన్నారు.

సామీ.. సౌకర్యాల లేమి?

రామేశ్వరం ఆలయంలో వసతులు కరువు

దాతలు సహకరించినా సాగని అభివృద్ధి
అర్ధంతరంగా ఆగిన కల్యాణ మండప నిర్మాణం.. నిలిచిన రాజగోపురం పనులు

షాద్‌నగర్ రూరల్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): పవిత్ర పుణ్యక్షేత్రమైన రామేశ్వరంలో భక్తుల సౌకర్యార్థం దాతలు చేపట్టిన అభివృద్ధి పనులు దేవాదాయ శాఖ అధికారుల సహకారం లేక అర్ధంతరంగా నిలిచిపోయాయి. దక్షిణ రామేశ్వరంగా (దండకారణ్యం) పేరు పొందిన ఈ ఆలయంలో సీతాన్వేషణలో భాగంగా శ్రీరాముడు శివలింగాన్ని ప్రతిష్ఠించాడని చెబుతారు. అలాంటి ఈ ఆలయం వద్ద భక్తులకు సౌకర్యాలు కల్పించడంలో దేవాదాయ శాఖ విఫలమైందన్న విమర్శలు వస్తున్నాయి. ప్రతీ సంవత్సరం మహా శివరాత్రి రోజు వేలాది మంది భక్తులు ఉపవాస దీక్షలతో ఇక్కడికి వస్తుంటారు. కనీస సౌకర్యాలు లేక నానా ఇబ్బందులు పడుతుంటారు. ఇక్కడ చాలావరకు భక్తుల కోసం దాతలు నిర్మించిన సత్రాలు ఉన్నాయి. భక్తుల నుంచి వస్తున్న ఆదాయం దేవాదాయ శాఖ పరిధిలోకి వెళ్తుంది.

అసంపూర్తిగా కల్యాణ మండపం

హైదరాబాద్‌కు చెందిన ఓ భక్తుడు

మిగతా 8వ పేజీలో...


అసంపూర్తిగా కల్యాణ మండపం

ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాం

కల్యాణ మండపం, రాజగోపురం నిర్మాణాలు అసంపూర్తిగా మిగిలిపోయిన విషయాన్ని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ దృష్టికి తీసుకెళ్లాం. ఆయన చొరవ తీసుకుని సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. పనులు త్వరలో ప్రారంభించేందుకు ప్రయత్నిస్తాం.


శివకుమార్, ఈవో, రామేశ్వరం

మతోన్మాద శక్తులను ఓడించాలి

» సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య

చేవెళ్ల, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల్లో మతోన్మాద శక్తులను ఓడించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమకుల జంగయ్య అన్నారు. గురువారం చేవెళ్లలోని పార్టీ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మతోన్మాద శక్తులను ఓడించడానికి జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో లౌకిక, ప్రజాస్వామ్య శక్తులతో కలిసి సీపీఐ పోటీ చేస్తుందన్నారు. డబ్బులకు, ఉచితాలకు ఆశపడి ఓటు వేయొద్దని కోరారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఎన్నికల్లో నిలబడే వారు సంపాదన కోసం కాకుండా సమాజ శ్రేయస్సు కోసం పాటుపడాలని సూచించారు. పార్టీ రాష్ట్ర సమితి సభ్యుడు రామస్వామి, ఎం.ప్రభులింగం, సత్యనారాయణ, ఎండి మక్బూల్, మంజుల, సుధాకర్‌గౌడ్, శివ, చంద్రకళ, జయమ్మ, సాయిలు, పాపయ్య, మీనాక్షి, యాదమ్మ, మల్లేష్ ఉన్నారు.


మాట్లాడుతున్న రాజ్‌భూపాల్‌గౌడ్

ఎన్నికలు ఏవైనా బీజేపీదే హవా

» బీజేపీ జిల్లా అధ్యక్షుడు పంతంగి రాజ్‌భూపాల్‌గౌడ్

మహేశ్వరం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : రానున్న స్థానిక ఎన్నికల్లో మెజారిటీ స్థానాలను బీజేపీ కైవసం చేసుకోవడం ఖాయమని, ఎన్నికలు ఏవైనా మహేశ్వరంలో కమలం జెండా ఎగరడం ఖాయమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పంతంగి రాజ్‌భూపాల్‌గౌడ్ అన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు తెల్లమల్ల యాదీష్ ఆధ్వర్యంలో గురువారం గొల్లూరు గ్రామానికి చెందిన పలువురు బీఆర్‌ఎస్, కాంగ్రెస్ కార్యకర్తలు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో ఘోరంగా విఫలమైందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై వస్తున్న బీసీ, ప్రజా వ్యతిరేకతను అనుకూలం చేసుకోవడానికి మాత్రమే బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అంశాన్ని తెరపైకి తెచ్చిందని విమర్శించారు. బీసీ రిజర్వేషన్ కోసం ఆర్డినెన్స్‌ను తెచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రం నుంచి అఖిల పక్షాన్ని కేంద్రం వద్దకు ఎందుకు తీసుకెళ్లడం లేదని ప్రశ్నించారు. స్థానిక ఎన్నికల నోటిఫికేషన్‌పై కాంగ్రెస్ అసమర్థత పాలనతో కోర్టుస్టే ఇవ్వడంతో ప్రజలను మరోసారి మోసం చేసిందన్నారు. స్థానిక ఎన్నికలే నిర్వహించలేని అసమర్థ ప్రభుత్వం ప్రజల అవసరాలను ఎలా తీరుస్తుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ స్థానిక సంస్థల జిల్లా కన్వీనర్ అందెల శ్రీరాములుయాదవ్, అనంతయ్యగౌడ్, మిద్దె సుదర్శన్‌రెడ్డి, మాధవాచారి, ఎ. యాదయ్యగౌడ్, కుండె వెంకటేష్, రఘుపతిగౌడ్, ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు,

ఉత్తమ క్రీడాకారులుగా ఎదగాలి

» సీఐ మహేందర్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): పాఠశాల స్థాయి నుంచే క్రీడల్లో నైపుణ్యం పెంపొందించుకొని ఉత్తమ క్రీడాకారులుగా ఎదగాలని ఇబ్రహీంపట్నం సీఐ మహేందర్‌రెడ్డి అన్నారు. గ్రామీణ ప్రాంత క్రీడాకారులెందరో జాతీయ స్థాయి, ఒలింపిక్స్‌లో రాణిస్తున్నారన్నారు. ఇబ్రహీంపట్నంలోని గురుకుల విద్యాపీఠ్ హైస్కూల్‌లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు జరిగిన అండర్-14, అండర్-17 జోనల్‌స్థాయి క్రీడాపోటీలు గురువారం సాయంత్రం ముగిశాయి. యాచారం, మంచాల, ఇబ్రహీంపట్నం మండలాలకు చెందిన పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. కబడ్డీ, వాలీబాల్, ఖోఖోలో ప్రతిభ కనబరిచిన టీంలకు షీల్డులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు శారీరక ఎదుగుదలతోపాటు ఏకాగ్రతను పెంచుతాయన్నారు. కార్యక్రమంలో గురుకుల విద్యాపీఠ్ హైస్కూల్ ప్రిన్సిపాల్ డి.శ్రీనివాస్‌రావు, క్రీడల జోనల్ సెక్రటరీ సుశీల, పీఈటీలు రాజు, మల్లేష్, కృష్ణ, అంజి, రాజశేఖర్, వినయ్, శేఖర్, యాదమ్మ, కవిత పాల్గొన్నారు.


షీల్డును అందజేస్తున్న సీఐ మహేందర్‌రెడ్డి తదితరులు


కలెక్టరేట్ ఎదుట విద్యార్థులతో కలిసి ధర్నా చేస్తున్న తల్లిదండ్రులు

ఉపకార వేతనాలు విడుదల చేయాలి

» కలెక్టరేట్ ఎదుట విద్యార్థులతో కలిసి తల్లిదండ్రుల ధర్నా

ఆమనగల్లు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ ఉపకార వేతనాలు వెంటనే విడుదల చేసి చదువులకు ఆటంకం లేకుండా చూడాలని గురువారం ఆమనగల్లు ప్రజ్ఞ బెస్ట్ అవెలబుల్ స్కూల్ పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. మూడేళ్లుగా ఉపకార వేతనాలు అందకపోవడంతో దసరా సెలవుల అనంతరం తల్లిదండ్రులతో కలిసి పాఠశాలకు చేరుకున్న విద్యార్థులను ప్రజ్ఞ పాఠశాల యాజమాన్యం పాఠశాలలోకి అనుమతించలేదు. దీంతో ఈనెల 7న పాఠశాల ఎదుట తమ పిల్లలతో కలిసి తల్లిదండ్రులు నిరసన తెలిపారు. రాష్ట్ర కమిటీ ఆదేశానుసారం బీఏఎస్ పాఠశాలలన్నీ తీసుకున్న నిర్ణయంలో తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. రూ.4.50 కోట్ల బకాయిలు చెల్లిస్తే కానీ పాఠశాలలోకి అనుమతించమని ప్రజ్ఞ స్కూల్ నిర్వాహకులు తెలిపారు. దీంతో తమ పిల్లలతో కలిసి తల్లిదండ్రులు కలెక్టరేట్‌కు చేరుకొని ధర్నా నిర్వహించారు. కలెక్టర్‌ను కలిసి తమ గోడును వెళ్లబోసుకున్నారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పెండింగ్ ఉపకార వేతనాలు విడుదలయ్యేలా చూస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

ప్రగతిని కాంక్షించి కాంగ్రెస్‌కు పట్టం గట్టాలి

స్థానిక ఎన్నికల్లో ఆదరించాలి
ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి

ఆమనగల్లు, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రగతిని కాంక్షించి ప్రజలంతా స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఆదరించి గెలిపించాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. సామాజిక న్యాయం, అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని ఆయన పేర్కొన్నారు. తలకొండపల్లి మండలం ఖానాపూర్ గ్రామంలో గురువారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు మోతీలాల్, శ్రీకాంత్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయం, అభ్యర్థుల ఎంపిక, ప్రభుత్వ పథకాల అమలు తదితర విషయాలపై చర్చించారు. అనంతరం జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఆశావహుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ప్రజాభిమానం కలిగి గెలిచే అభ్యర్థులను పార్టీ అధిష్ఠానం ప్రకటిస్తుందన్నారు. సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్ కుమార్ రెడ్డి, నాయకులు పర్వత్ రెడ్డి, భూపతిరెడ్డి, ఆనంద్, సంజీవ్‌కుమార్, అశోక్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్టులో బంగారం పట్టివేత

రూ.3.77 కోట్ల విలువైనదిగా గుర్తింపు

శంషాబాద్ రూరల్, అక్టోబర్ 9 (ఆంధ్రజ్యోతి): శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో అక్రమంగా తీసుకొస్తున్న బంగారం, వెండిని కస్టమ్స్ అధికారులు పట్టుకున్నారు. బిన్సాన్ డేవిస్ అనే ప్రయాణికుడు కొచ్చి నుంచి వయా శంషాబాద్ ఎయిర్‌పోర్టు మీదుగా భువనేశ్వర్ వెళ్లాలి. అయితే శంషాబాద్ విమానాశ్రయంలో నిందితుడు దిగగానే అతనిపై సీఐఎస్‌ఎఫ్ అధికారులకు అనుమానం వచ్చింది. అతని హ్యాండ్ బ్యాగ్ తనిఖీ చేయగా, అందులో 2.803 కేజీల బంగారు ఆభరణాలు, 3.07 కేజీల వెండి ఆభరణాలు ఉన్నట్లు గుర్తించారు. వాటిని స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన బంగారం విలువ దాదాపు రూ.3.32 కోట్లు, వెండి విలువ రూ.45.5 లక్షలు ఉంటుందని అధికారులు వెల్లడించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్ ఉపకార వేతనాలపై అవగాహన

బొంరాస్‌పేట్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): బొంరాస్‌పేట్ జిల్లా పరిషత్ పాఠశాలలో గురువారం విద్యార్థులకు ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్ ఎన్ఎంఎంఎస్ ఉపకార వేతనాలపై అవగాహన కల్పించారు. నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షలో విద్యార్థులు ప్రతిభ చూపితే ఏడాదికి రూ.12వేలు పొందొచ్చన్నారు. ప్రభుత్వ బడుల్లో చదువుతూ ఆర్థికంగా వెనకబడిన విద్యార్థులకు కేంద్రం 2008 నుంచి ఎన్‌ఎంఎంఎస్ ఉపకార వేతనాలను ఇస్తోందని తెలిపారు. ఎనిమిదో తరగతి తర్వాత మధ్యలో చదువుమానేయకుండా ఇంటర్ వరకు కొనసాగించే విధంగా స్కాలర్‌షిప్‌లు ఇస్తోందని చెప్పారు. 2025-2026కు ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైందని తెలిపారు.

గ్రామాల్లో అన్ని సదుపాయాలు కల్పిస్తా


లాల్‌గడి మలక్‌పేటలో మహిళలను అడిగి సమస్యలను తెలుసుకుంటున్న ఎంపీ ఈటల రాజేందర్, స్థానిక నాయకులు

శామీర్‌పేట, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషిచేయడమే తన బాధ్యతని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు బుద్ధి శ్రీనివాస్, పార్టీ మండల అధ్యక్షుడు కొర్వి క్రిష్ణల కోరిక మేరకు గురువారం ఎంపీ ఈటల లాల్‌గడి మలకొపేటలో పర్యటించారు. గ్రామ ఎస్సీ, ఇతర కాలనీలను సందర్శించి ప్రజలతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. తమ గ్రామంలో సదుపాయాలు లేక ఏళ్ల తరబడి నరకయాతన అనుభవిస్తున్నామని, అధికారులకు ఎన్నిసార్లు తెలిపినా పట్టించుకోవడం లేదని ఎస్సీ కాలనీ వాసులు ఎంపీకి మొరపెట్టుకున్నారు. డ్రైనేజీ వ్యవస్థ లేక రోడ్డుపై మురు గు పారుతోందని, రోగాల బారిన పడుతున్నామని మొ రపెట్టుకున్నారు. లాల్‌గడిలో ప్రజల సమస్యలపై ఎంపీ ఈటల స్పందిస్తూ.. ఎస్సీ కాలనీలో సాధ్యమైనంత త్వరలో డ్రైనేజీని నిర్మింపచేసి సమస్యను పరిష్కరించేందుకు కృషిచేస్తానని భరోసా ఇచ్చారు. తాము కోరిన వెంటనే తమ గ్రామానికి వచ్చి ప్రజా సమస్యలు తెలుసుకు న్న ఎంపీ రాజేందర్‌కు ప్రజలు, బీజేపీ నాయకులు క్రిష్ణ, కైర యాదగిరి, మాజీ సర్పంచ్‌లు మామిండ్ల అశోక్, కైర రమేశ్, మాజీ ఎంపీటీసీ రాజిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

సెల్‌ఫోన్ చోరీ చేసిన వ్యక్తి హత్య

● కేసు వివరాలు వెల్లడించిన సీఐ


వెంకన్న(ఫైల్)

ఘట్‌కేసర్ రూరల్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్ చోరీ చేశాడని వ్యక్తిని హత్య చేసిన ఇద్దరిని పోచారం ఐటీ కారిడార్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఘటనపై సీఐ రాజువర్మ తెలిపిన వివరాల ప్రకారం.. సెల్‌ఫోన్ చోరీ చేశాడని బుధవారం రాత్రి ఇద్దరు మరో వ్యక్తిని హత్య చేశారు. భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా ఇల్లందుకు చెందిన చిట్టగాని వెంకన్న(48) పాత పోచారంలో ఉంటూ ఘట్‌కేసర్‌లో ఓ ఇటుకల కంపెనీలో డ్రైవర్‌గా పని చేసేవాడు. అక్కడే అద్దెకుంటున్న వివేక్(24) ఆటో డ్రైవర్‌గా, మల్లేష్(35) కూలిపని చేస్తుంటాడు. మహబూబాబాద్ జిల్లా జయారానికి చెందిన వీరిద్దరు మిత్రులు. కాగా మూడు రోజుల క్రితం వివేక్ సెల్‌ఫోన్‌ను వెంకన్న అపహరించాడు. ఈ విషయం తెలుసుకున్న వివేక్.. మల్లేష్ సాయంతో బుధవారం మధ్యాహ్నం జోడిమెట్ల వద్ద వెంకన్నను ఆటోలో ఎక్కించుకున్నారు. సెల్‌ఫోన్ గురించి ఆరా తీశారు. జోడిమెట్లలో ఓ దుకాణంలో కుదవపెట్టినట్లు వెంకన్న చెప్పాడు. ఆ దుకాణం వద్దకు తీసుకెళ్లి ఫోన్ విడిపించుకొని వెంకన్నపై దాడిచేశారు. ఆటోలో ఎక్కించుకొని పాత పోచారంలోని నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లి వెంకన్నను సాయంత్రం వరకు చితకబాదారు. అతడి పరిస్థితి విషమంగా మారడంతో అతడి కటుంబ సభ్యులకు అప్పగించారు. వెంకన్న తనకు ఛాతీలో నొప్పి వస్తోందని చెప్పడంతో కుటుంబ సభ్యులు మల్లేష్, వివేక్‌లతో కలిసి ఆటోలో ఘట్‌కేసర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే వెంకన్న మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో పోలీసులు అనుమానాస్పదస్థితిలో మృతిగా కేసు నమోదు చేశారు. మల్లేష్, వివేక్‌లను అదుపులోకి తీసుకొని విచారించగా తామే చంపినట్లు ఒప్పుకున్నారు. వెంకన్న సెల్‌ఫోన్ చోరీ చేశాడని కొట్టడంతో మృతిచెందినట్లు తెలిపారు. వివేక్, మల్లేష్‌లపై హత్య కేసు నమోదు చేసి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజువర్మ వివరించారు.

శానిటేషన్ ట్రక్కు ప్రారంభం



మరుగుదొడ్లు శుభ్రంచేసే ట్రక్కును ప్రారంభిస్తున్న బీజేపీ నాయకులు

మోమిన్‌పేట్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి):ఎన్కతల గ్రామంలో బీజేపీ నాయకులు గురువారం శానిటేషన్ ట్రక్కును ప్రారంభించారు. జస్టిస్ కొండా మాధవరెడ్డి ఫౌండేషన్ ద్వారా స్వచ్ఛ విద్యాలయం కార్యక్రమంలో భాగంగా జడ్పీహెచ్ఎస్, ప్రైమరీ పాఠశాలల్లో ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సహకారంతో ఈ ట్రక్కును ప్రారంభించినట్లు తెలిపారు. మరుగుదొడ్ల శుభ్రపర్చేందుకు ఈ ట్రక్కును వినియోగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి రమేశ్, మల్లేశం, రవీందర్‌రెడ్డి, రమేశ్‌గౌడ్, లింగయ్య, హెచ్ఎం ప్రభు పాల్గొన్నారు.

తిరుమలనాథ స్వామి ఆలయంలో కళాకారిణి శోభారాజు గాన కచేరి



అన్నమయ్య కీర్తనలు ఆలపిస్తున్న డాక్టర్ శోభారాజు, ఆమె శిష్యులు

ఫూడూరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్ద ఉమెంతాల్ గ్రామంలోని తిరుమలనాథ స్వామి ఆలయంలో పద్మశ్రీ పురస్కార గ్రహీత, కళాకారిణి డాక్టర్ శోభారాజు తన శిష్యులతో కలిసి గురువారం అన్నమయ్య సంకీర్తనలను ఆలపించారు. ప్రపంచ వ్యాప్తంగా అన్నమయ్య కీర్తనల్లో భాగంగా కొండలలో నెలకొన్న సంకీర్తన విశేషంగా ఆకట్టుకుంది. మొదట గణరాజా గుణరాజా అంటూ గణపతిపై శోభారాజు స్వీయ రచన పాడగా శ్రీమహాలక్ష్మీ అమ్మవారిపై రావమ్మా మహాలక్ష్మీ అంటూ కీర్తించారు. చివరిగా బ్రహ్మమొక్కటే పర బ్రహ్మమొక్కటే తందనాన ఆదీ.. అనే సంకీర్తనతో కార్యక్రమాన్ని ముగించారు. కార్యక్రమానికి గాత్ర సహకారం శోభారాజు శిష్యులు రన్వితారెడ్డి, ఆశ్రిత, పద్మశ్రీ చైత్ర, అక్షయ్, మానస, అభిరామ్ అందించారు. కీబోర్డు రాజు, తబల అజయ్ వాయించారు. చివరలో పీఠాధిపతి వెంకటదాసు,ధర్మకర్తలు సంగీతగోవర్ధన్‌రెడ్డి దంపతులు శోభారాజును సన్మానించారు.


పాదయాత్రగా శబరిమలకు వెళ్తున్న మహేందర్‌యాదవ్

కఠినమైనది.. అయ్యప్ప దీక్ష

మొయినాబాద్ రూరల్,అక్టోబరు 9(ఆంధ్యజ్యోతి):కేరళలోని అయ్యప్పస్వామిని దర్శించుకునేందుకు కాలిడకన బయల్దేరుతున్న అయ్యప్ప మాలధారులు ఎంతో పుణ్యాత్ములని, వారికి అయ్యప్పస్వామి అనుగ్రహం జీవితాంతం ఉంటుందని ఆధ్యాత్మికవేత్త కేశవ్ గురుస్వామి అన్నారు. శబరిమలకు నడుచుకుంటూ వెళ్లి దేవుడిని దర్శించుకోవడం గొప్ప అనుభూతి అని చెప్పారు. మొయినాబాద్ మున్సిపల్ పరిధి హిమాయత్‌నగర్‌కు చెందిన ముదిగొండ మహేందర్‌యాదవ్ 18 సార్లు అయ్యప్ప మాలధరించి గురువారం కాలిడకన ఇరుముడి కట్టుకొని శబరిమలకు బయల్దేరాడు. హనుమాన్ ఆలయంలో ఆయనకు కేశవ్ గురుస్వామి ఆధ్వర్యంలో పూజలు చేసి పంపారు. ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ దైవచింతను అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హిమాయత్‌నగర్ సన్నిధానం గురుస్వామి నూనె మురళి, నాయకులు ముదిగొండ రవియాదవ్, మంజుల, శాంతియువజన సంఘం అధ్యక్షుడు నరేష్, మల్లేష్, భక్తులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపోలో గ్యార్మీ వేడుకలు


డిపోలో వేడుకలు జరుపుకుంటున్న కార్మికులు

మేడ్చల్ టౌన్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): మత సామరస్యాన్ని చాటుతూ గురువారం మేడ్చల్ ఆర్టీసీ డిపో కార్మికులు డిపో ఆవరణలో గ్యార్మీ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికులు గార్వీ జెండాను ఆవిష్కరించి ప్రార్థనలు నిర్వహించారు. పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డిపో డ్రైవర్లు, కండక్టర్లు పాల్గొన్నారు.

బాణసంచా దుకాణాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరి


మాట్లాడుతున్న సీఐ వెంకట్

మోమిన్‌పేట్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మోమిన్‌పేట్, మర్పల్లి, నవాబుపేట మండలాల్లో దీపావళి సందర్భంగా బాణసంచా దుకాణాలను ఏర్పాటు చేసే వారు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని సీఐ వెంకట్ సూచించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. దుకాణాల ఏర్పాటు కోసం వ్యాపారులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అగ్నిమాపక శాఖ అధికారులు జారీ చేసిన ఎన్‌వోసీ, ప్రైవేట్ స్థలాల్లో దుకాణాలను ఏర్పాటు చేస్తే సంబంధిత ప్రభుత్వ అధికారుల అనుమతులు తీసుకోవాలన్నారు. ఈ నెల 16వ తేదీ లోపు కలెక్టర్, జిల్లా మెజిస్ట్రేట్‌కు దరఖాస్తులు సమర్పించాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు.

బీసీలకు రేవంత్‌రెడ్డి ఘరానా మోసం

● మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్



వికారాబాద్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): బీసీలకు రేవంత్‌రెడ్డి ఘరానా మోసం చేశారని మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ అన్నారు. బీసీ రిజర్వేషన్లపై రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు పూటకో మాట మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. బీసీ రిజర్వేషన్ల వర్తింపు అసాధ్యమని తెలిసినా మాటల గారడీ చేశారని మండిపడ్డారు. ఒకసారి కేంద్రం 9వ షెడ్యూల్‌లో చేర్చాలంట హడావుడి చేశారని, మరోసారి పార్టీ పరంగా రిజర్వేషన్లు కల్పిస్తామని, ఆర్డినెన్స్ ద్వారా అమలు చేస్తున్నామని ఇలా పూటకో మాటతో కాలయాపన చేశారన్నారు. చెల్లదని తెలిసినా జీవో తెచ్చిన రేవంత్‌రెడ్డి.. ఆపై తన అనుచరులతో కోర్టులో కేసు వేయించారన్నారు. వాస్తవానికి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించే ఉద్దేశం సీఎం రేవంత్‌రెడ్డికి లేదని, అందుకే ఇన్ని డ్రామాలకు పూనుకుని ప్రజల, నాయకుల విలువైన సమయాన్ని వృథా చేశారన్నారు. కపట నాటకాలతో బీసీలను మోసం చేసిన రేవంత్‌రెడ్డి బీసీ వర్గాల ఆగ్రహానికి గురికాక తప్పదని ఆయన హెచ్చరించారు.

జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కోసమే రిజర్వేషన్ల డ్రామా



షాద్‌నగర్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఎన్నికల కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం బీసీల రిజర్వేషన్ డ్రామా ఎత్తుకుందని మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి అన్నారు. బీసీల పట్ల చిత్తశుద్ధి ఉంటే రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్ ప్రకారం రిజర్వేషన్ల మార్పుపై కేంద్రంపై ఒత్తిడి తేవాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీవో 9ను రాష్ట్ర గవర్నర్ ఆమోదించకముందే ఎన్నికల షెడ్యూల్ విడుదల ఎం దుకు చేశారని ప్రశ్నించారు. బీసీల కోసం ఎంతో చేశామని చెప్పుకునేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం డ్రామాలు చేసిందని, సీఎం రేవంత్‌రెడ్డికి బీసీల పట్ల చిత్తశుద్ధి ఉంటే 9వ షెడ్యూల్ మార్పు కోసం కేంద్రంపై ఒత్తిడి తేవాలని అన్నారు.

చట్ట ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలి



షాద్‌నగర్: కాంగ్రెస్ ప్రభుత్వానికి బీసీలపై చిత్తశుద్ధి ఉంటే చట్ట ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్ ఉన్న నిబంధనలను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. బీసీ రిజర్వేషన్లపై కేంద్రంతో ఎందుకు చర్చించలేదని ఆయన ప్రశ్నించారు. రిజర్వేషన్లను తాము కూడా స్వాగతిస్తున్నామని, కానీ చట్ట ప్రకారం వాటి అమలుకు ప్రభుత్వం కృషి చేయాలన్నారు.

బీసీలను వంచిస్తున్న కాంగ్రెస్



చేవెళ్ల, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రజలను మోసగించే నాటకమని బీఆర్ఎస్ చేవెళ్ల మండల ఉపాధ్యక్షుడు ఎస్. రామగౌడ్ అన్నారు. గురువారం ఆయన చేవెళ్లలో విలేకరులతో మాట్లాడుతూ.. ప్రజల్లో పెరుగుతున్న వ్యతిరేకతను కప్పిపుచ్చుకోవడానికి ప్రభుత్వం ఇలాంటి ప్రకటనలు చేస్తోందని ఆరోపించారు. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించక 22 నెలలుగా పంచాయతీ పాలన కుంటుపడిందన్నారు. ప్రభుత్వం తన వైఫల్యాలను దాచిపెట్టేందుకే రిజర్వేషన్ల హామీల రూపంలో ప్రజలను మోసం చేసేందుకు ప్రయత్నిస్తోందన్నారు. నిజమైన న్యాయం చేయాలంటే తక్షణమే ఎన్నికలు నిర్వహించి, రాజ్యాంగబద్ధంగా రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. పంచాయతీరాజ్ వ్యవస్థ బలహీనపడుతోందని, కాంగ్రెస్ విలువలను తుంగలో తొక్కుతోందని మండిపడ్డారు.


చెరువులో పూజలు చేస్తున్న ముదిరాజ్, మత్స్యకార సంఘాల నాయకులు

చెరువులు మత్స్యకారులకు జీవనాధారం

కందుకూరు, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): చెరువులు, కుంటలు ముదిరాజ్, మత్స్యకారులకు జీవనాధారమని ఆ సంఘాల కొత్తగూడ అధ్యక్షులు పిట్టల యాదయ్య, తాళ్ల నర్సింహ అన్నారు. ఇటీవలి వర్షాలకు కొత్తగూడ సున్నం చెరువు నిండింది. దీంతో గురువారం చెరువులో పూజలు చేశారు. చెరువు నిండడంతో చేపల పెంపకానికి అవకాశం కలిగిందన్నారు. ఇదే మాకు ఉపాధి కల్పిస్తుందని తెలిపారు. రైతులు, కుల వృత్తుల వారికి మేలు కలుగుతుందన్నారు. కార్యక్రమంలో తాళ్ల బాలేష్, శేఖర్, కృష్ణ, సత్తయ్య, శ్రీశైలం, మల్లేష్, కిరణ్, శ్రీకాంత్, అంజన్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీవో వినితాదేవి

ఆదిభట్ల/యాచారం, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): గర్భిణులు నూనె పదార్థాలను తగ్గించి పౌష్టికాహారం తీసుకోవాలని సీడీపీవో వినితాదేవి అన్నారు. గురువారం యాచారం రైతు వేదికలో అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గర్భిణులు ఐరన్, విటమిన్-డి పదార్థాలు ఎక్కువగా తినాలన్నారు. టైం ప్రకారం ఆహారం తీసుకుంటే బిడ్డపోషణ బాగుటుందన్నారు. రెండేళ్ల వరకు శిశువులకు తల్లి పాలు పట్టాలన్నారు. ఇలా చేస్తే బిడ్డకు, తల్లికి మేలు కలుగుతుందన్నారు. బాలింతలు చక్కెర, నూనె వినియోగం తగ్గించుకోవాలన్నారు. ఎదిగే పిల్లలకు అదనపు పోషకాహార పదార్థాలు అందివ్వాలని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రియాంక, ఏపీఎం రవీంద్రచారి, సీహెచ్‌సీ సూపర్వైజర్, అంగన్‌వాడీల టీచర్లు, బాలింతలు పాల్గొన్నారు.

హామీలపై కాంగ్రెస్‌ను నిలదీయాలి

» మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్


కాంగ్రెస్ బాకీ కార్డులు పంచుతున్న మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

షాద్‌నగర్ అర్బన్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ఎన్నికల హామీల అమలుపై ప్రజలు నిలదీయాలని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే వై.అంజయ్యయాదవ్ పిలుపునిచ్చారు. షాద్‌నగర్ మున్సిపాలిటీ 11వ వార్డులో గురువారం నాయకులతో కలిసి పర్యటించారు. కాంగ్రెస్ ఎన్నికల హామీపై బీఆర్ఎస్ ముద్రించిన బాకీకార్డులను ప్రజలకు పంపిణీ చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో 22 నెలలైనా కాంగ్రెస్ ప్రభుత్వం అమలుచేయకుండా ప్రజలను మోసం చేస్తోందని అన్నారు. గ్యారంటీలను పూర్తిగా అమలు చేయడం లేదన్నారు. చాలా మంది రైతులకు రుణమాఫీ కాలేదని, రైతుభరోసా అందరికీ రాలేదని, మహిళలకు నెలనెలా రూ.2,500 ఇవ్వడం లేదని, ఇస్తున్న పెన్షన్‌ను పెంచలేదన్నారు. కల్యాణలక్ష్మి పథకంలో రూ.లక్ష, తులం బంగారం, విద్యార్థినులకు స్కూటీలను, నిరుద్యోగ భృతిని ఇవ్వలేదని తెలిపారు. హామీలను అమలుచేయకుండా ఓట్లకోసం వచ్చే కాంగ్రెస్ పార్టీ నాయకులను నిలదీయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వి.నారాయణరెడ్డి, ఈట గణేష్, కె.నరేందర్, నటరాజ్, రాజ్యలక్ష్మి, కడెంపల్లి శ్రీనివాస్, దేవేందర్‌యాదవ్, కొస్గి శ్రీనివాస్, ఈగ వెంకట్‌రాంరెడ్డి, యుగంధర్, శంకర్, శేఖర్, రవియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నేతల ముందస్తు అరెస్టు


బస్ డిపో వద్ద ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మేడ్చల్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కాంగ్రెస్ ప్రభుత్వం పెంచిన బస్ చార్జీలకు నిరసనగా గురువారం బీఆర్ఎస్ ఆందోళనలకు పిలుపునివ్వడంతో పోలీసులు గురువారం ఆ పార్టీ నాయకులను ముందస్తుగా అరెస్టు చేశారు. జిల్లాలోని నేతలను పోలీసులు ఎక్కడికక్కడే అరెస్టులు చేశారు. ముఖ్య నేతలను హౌస్ అరెస్టు చేశారు. పలువురు బీఆర్ఎస్ నాయకులు బస్‌డిపోల వద్ద ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

గురుకుల విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

శామీర్‌పేట, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ గురుకుల కళాశాలల విద్యార్థులు నిత్యం క్రీడకల్లో శిక్షణ పొందుతూ ప్రపంచస్థాయి క్రీడాకారులుగా ఎదగాలని కళాశాల ప్రిన్సిపాల్ క్రిష్ణ పిలుపు నిచ్చారు. గురువారం మూడుచింతలపల్లి మండలం జగ్గంగూడలోని తెలంగాణ మైనార్టీ గురుకుల కళాశాలకు చెందిన ఇంటర్ సెకండియర్ విద్యార్థి పి.రంగా ఇటీవల అండర్-19 గ్రూప్‌లో ఎస్‌జీఎఫ్‌ఐ కబడ్డీ పోటీల్లో గెలుపొందాడు. జిల్లా క్రీడా పోటీల్లో విజేతగా నిలిచిన రంగాను త్వరలో మహబూబాబాద్ జిల్లాలో జరుగనున్న రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక చేసినట్లు ప్రిన్సిపాల్ వెల్లడించారు. గురువారం కళాశాలలో రంగాను ప్రిన్సిపాల్, పీడీ సురేందర్, పీఈటీ వెంకటేశ్, కోఆర్డినేటర్ నర్సారెడ్డి, అధ్యాపకులు అభినందించి సన్మానించారు.

హాస్టల్లో ఉండటం ఇష్టంలేక...

ఫినాయిల్ తాగిన విద్యార్థి

» ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలుడు

కేశంపేట, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): హాస్టల్లో ఉండటం ఇష్టం లేక ఓ విద్యార్థి ఫినాయిల్ తాగి.. ఆస్పత్రి పాలైన సంఘటన కేశంపేట బీసీ గురుకులంలో గురువారం చోటుచేసుకుంది. షాద్‌నగర్‌లోని వివేకానంద ఇంజనీరింగ్ కళాశాలలో కేశంపేట బీసీ గురుకులం కొనసాగుతోంది. ఫరూఖ్‌నగర్ మండలం పెద్ద చిల్కమర్రికి చెందిన రమేష్-మంజుల దంపతుల కుమారుడు హర్షవర్ధన్ ఇక్కడ పదో తరగతి చదువుకుంటున్నాడు. చదువుపై ఇష్టం లేని హర్షవర్ధన్ మూడు రోజుల కింద తాను రోజు తాగే స్టీల్ వాటర్ బాటిల్‌లో ఫినాయిల్ కలుపుకున్నాడు. గురువారం ఉదయం ఫినాయిల్ తాగానని, వాంతులు అవుతున్నాయని టీచర్లకు చెప్పాడు. దీంతో స్పందించిన ప్రిన్సిపాల్ ప్రీతి, తోటి టీచర్లు బాలుడిని షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షలు నిర్వహించి హర్షవర్ధన్‌కు ఫ్లూయిడ్స్ ఎక్కిస్తున్నారు. ప్రస్తుతం అతడి ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.

ఆశలు ఆవిరి

(ఐదోపేజీ తరువాయి)

ఉత్కంఠ కొనసాగుతుండగానే జిల్లాలో పలు చోట్ల తొలి రోజే పలువురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. అయితే సాయంత్రం పరిస్థితి ఒక్కసారిగా తారుమారైంది. స్థానిక ఎన్నికలకు సంబంధించి జారీ చేసిన నోటిఫికేషన్‌ను రద్దు చేస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో నామినేషన్లు దాఖలు చేసిన వారితో పాటు తరువాత రోజుల్లో నామినేషన్ల దాఖలుకు సిద్ధమైన వారంతా డీలా పడ్డారు. తమ రాజకీయ భవిష్యత్తు ఏమిటనేదీ తెలియక అయోమయంతో ఉన్నారు. హైకోర్టు స్టే ఇచ్చిన నేపథ్యంలో ప్రభుత్వం తదుపరి ఏం చేస్తుంది? ఎన్నికల సంఘం నిర్ణయాలు ఎలా ఉంటాయి? పాత రిజర్వేషన్ పద్ధతిలోనే మళ్లీ ఎన్నికలు ఉంటాయా? ఉంటే తమ ప్రాంతంలో రిజర్వేషన్లు అనుకూలంగా ఉంటాయా? అనేదానిపై అన్ని పార్టీలకు చెందిన అన్ని వర్గాల నాయకులు ఆందోళన చెందుతున్నారు.

రెండు జిల్లాల్లో 9 నామినేషన్లు దాఖలు

జిల్లాలో చేవెళ్ల, కందుకూరు, రాజేంద్రనగర్ రెవెన్యూ డివిజన్ల పరిధిలోని 10 జడ్పీటీసీ, 110 ఎంపీటీసీ స్థానాలకు గురువారం నోటిఫికేషన్ జారీ చేశారు. చేవెళ్ల, మొయినాబాద్, షాబాద్, శంకరపల్లి, కందుకూరు, మహేశ్వరం, కడ్తాల్, ఆమనగల్, తలకొండపల్లి, శంషాబాద్ జడ్పీటీసీ స్థానాలతో పాటు వీటి పరిధిలోని ఎంపీటీసీ స్థానాలకు నామినేషన్ల ప్రక్రియ ప్రారంభంకాగా తొలిరోజు 8 ఎంపీటీసీ స్థానాలకు నామినేషన్లు దాఖలయ్యాయి. ఇందులో ఆరుగురు కాంగ్రెస్ పార్టీ తరపున నామినేషన్లు దాఖలు చేయగా ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్లు వేశారు. జెడ్పీటీసీ స్థానాల్లో ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు. అలాగే వికారాబాద్ జిల్లా బంట్వారం ఎంపీటీసీ స్థానం నుంచి ఓ స్వతంత్ర అభ్యర్థి నామినేషన్ వేశారు. బీసీ రిజర్వేషన్లపై గురువారం హైకోర్టులో వాదనలు ఉన్న నేపథ్యంలో ఎన్నికలు కొనసాగుతాయా, లేదా అనే స్పష్టత లేక నామినేషన్లు వేసేందుకు అభ్యర్థులు ముందుకు రాలేదు.

నటుడు శ్రీకాంత్ భరత్‌పై చర్యలు తీసుకోవాలి


గందె సురేష్


శ్రీనివాసులుగుప్తా

షాద్‌నగర్ అర్బన్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): అహింసా సిద్ధాంతంతో దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన మహాత్మగాంధీని అవహేళన చేస్తున్న సినీ నటుడు శ్రీకాంత్ భరత్‌పై చట్టపర చర్యలు తీసుకోవాలని ఆర్యవైశ్య మహాసభ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు గందె సురేశ్, షాద్‌నగర్ అధ్యక్షుడు మలిపెద్ది శ్రీనివాసులుగుప్తా గురువారం వేర్వేరు ప్రకటనల్లో డిమాండ్ చేశారు. ప్రపంచ దేశాల ప్రజలకు సైతం ఆదర్శంగా నిలిచిన గాంధీజీని అవహేళన చేస్తూ శ్రీకాంత్‌భరత్ సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారని, జాతిపితను అవహేళన చేస్తే, దేశంలోని ప్రతీ ఒక్కరిని అవమానించినట్టేనని పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించిన శ్రీకాంత్ భరత్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు.

దమ్ము లేకనే దుష్ప్రచారం

మా పలుకుబడి చూసి బీఆర్ఎస్‌కు ఓటమి భయం

» రూ.లక్షల్లో జీతంతో విదేశాల్లో స్థిరపడే అవకాశం ఉన్నా ప్రజలకు సేవ చేసేందుకే నేను రాజకీయాల్లోకి వచ్చా

» టికెట్ రానివారిని కలుస్తా.. అందరినీ కలుపుకొనిపోతా

» సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులే ఎన్నికల అస్త్రాలు

» ఆరు నూరైనా ఈ ఉప ఎన్నికలో గెలుపు మాదే

» 'ఆంధ్రజ్యోతి'తో జూబ్లీహిల్స్ కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్



హైదరాబాద్ సిటీ/బంజారాహిల్స్ అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): 'ప్లానింగ్ ఆర్కిటెక్చర్‌లో పట్టభద్రుడిని. నేను చదివిన చదువుకు విదేశాల్లో సెటిలై లక్షల్లో వేతనం పొందే అవకాశం ఉంది. అయినప్పటికీ నాకు రాజకీయాలంటే ఆసక్తి. పుట్టినగడ్డలోని ప్రజలకు మరింత సేవ చేయాలనే ఉద్దేశంతోనే రాజకీయాల్లోకి వచ్చాను. ఉప ఎన్నికలో నన్ను రాజకీయంగా ఎదుర్కొనే దమ్ములేకనే బీఆర్ఎస్ పార్టీ దుష్ప్రచారం చేస్తోంది.' అని కాంగ్రెస్ జూబ్లీహిల్స్ నియోజకవర్గ అభ్యర్థి వల్లాల నవీన్‌యాదవ్ అన్నారు. 'మొదటిసారి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసి ప్రజల మన్ననలతో 40 వేల ఓటు బ్యాంకు సంపాదించాను. రెండోసారి ఇండిపెండెంట్‌గా బరిలో నిలిచి 20 వేలకు పైగా ఓట్లు సాధించాను. ఇప్పుడు కాంగ్రెస్ టికెట్ ఖరారు కావడంతోనే నా విజయం ఖాయమైంది.' అని పేర్కొన్నారు. నవీన్ యాదవ్‌తో 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక ఇంటర్వ్యూ సాగింది ఇలా..

ఆంధ్రజ్యోతి: టికెట్ కోసం ఎంతో మంది ప్రయత్నించారు. మిమ్మల్ని అభ్యర్థిగా పార్టీ ప్రకటించడంపై?

నవీన్‌యాదవ్: ఎవరికైతే నియోజకవర్గంలో పట్టు, గెలిచే సత్తా ఉంటుందో తెలుసుకునేందుకు పార్టీ అనేక సర్వేలు చేసింది. ప్రత్యర్థులకు పోటీనివ్వడంతోపాటు గెలుపొందే వ్యక్తి ఎవరో అధిష్ఠానం గుర్తించింది. అందుకే నాకు టికెట్ కేటాయించింది. ఇది చాలా సంతోషంగా ఉంది.

ఆంధ్రజ్యోతి: టికెట్ కోసం ఆశపడి భంగపడిన వారిని కలుపుకుని పోతారా?

నవీన్‌యాదవ్: అందరం కుటుంబ సభ్యులుగా ఉంటాం. టికెట్ కోసం ప్రయత్నించిన అందరినీ కచ్చితంగా కలుస్తాను. కలుపు కొనిపోతాను. అందరూ సర్దుకుపోయే మనస్తత్వం ఉన్నవారే. కాంగ్రెస్ పార్టీలో అందరికీ అనేక అవకాశాలు వస్తూనే ఉంటాయి.

ఆంధ్రజ్యోతి: ఈ ఉప పోరులో మీ వ్యూహమేంటి?

నవీన్‌యాదవ్: రాష్ట్రంలో జూబ్లీహిల్స్‌ను రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దడమే మా ప్రధాన లక్ష్యం. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి, ప్రజాపాలనే ఎన్నికలో ప్రచారాస్త్రాలు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో అభివృద్ధి ఆనవాళ్లు లేవు. ఇది ప్రజల ముందు ఉంచుతా. తమ హయాంలో కేవలం రెండు నెలల్లోనే నియోజకవర్గానికి రూ.150కోట్ల పనులు మంజూరయ్యాయి. ఇందులో రూ.80కోట్ల పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. తాను గెలిచిన తర్వాత నియోజకవర్గాన్ని మరింతగా తీర్చిదిద్దుతా.

ఆంధ్రజ్యోతి: ప్రత్యర్థి పార్టీకి సానుకూలాంశంగా ఉన్న సానుభూతిని మీరు ఎలా అధిగమిస్తారు?

నవీన్‌యాదవ్: 40ఏళ్లకు పైగా నియోజకవర్గ ప్రజలతో మాకు ప్రత్యేక అనుబంధం ఉంది. అందరితో ఉన్న మంచితనమే ఎన్నికల్లో మా బలం.

ఆంధ్రజ్యోతి: టికెట్ రాకపోవడంతో మీ సామాజిక వర్గానికి చెందిన నేతలు కినుకుతో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.? ఆ ప్రతికూలతను ఎలా అధిగమిస్తారు?

నవీన్‌యాదవ్: అందరం కాంగ్రెస్ పార్టీనేతలం. టికెట్ ఆశించడంలో తప్పులేదు. అందరితో కలిసి ఎన్నికల్లో గెలిచేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టాను.

ఆంధ్రజ్యోతి: మీకున్న సానుకూల అంశాలు ఏమిటి..?

నవీన్‌యాదవ్: నేను స్థానికుడిని. ఇప్పటికే రెండు దఫాలుగా ఎన్నికల్లో పోటీ చేసిన అనుభవం ఉంది.

ఆంధ్రజ్యోతి: గత ఎన్నికల్లో ఓటమి నుంచి మీరు నేర్చుకున్న పాఠాలేమిటి?

నవీన్‌యాదవ్: 2014లో ఎంఐఎం నుంచి పోటీ చేయడంతో మైనార్టీలతో నాకు విస్తృతమైన పరిచయాలు ఏర్పడ్డాయి. 2018లో బీఆర్ఎస్ టికెట్ ఇస్తుందని నమ్మించి మోసం చేశారు. ఇండిపెండెంట్‌గా పోటీచేసి ప్రజలకు మరింత దగ్గరయ్యాను. ఈ సమయంలో యువతతో విస్తృత సంబంధాలను ఏర్పరుచుకున్నాను. దీంతోపాటు కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలో ఉండడం మా బలం. గత పదేళ్ల బీఆర్ఎస్ సర్కార్‌లో నియోజకవర్గంలో ఒక్క రేషన్‌కార్డు కూడా ఇవ్వలేదు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు నియోజకవర్గ ప్రజలకు అందుతుండడం.

ఆంధ్రజ్యోతి: ఇటీవల ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టారు? ఉప ఎన్నిక నేపథ్యంలోనేనా?

నవీన్‌యాదవ్: జూబ్లీహిల్స్ నియోజకవర్గ అభివృద్ధికి బీఆర్ఎస్ ఏమీ చేయలేదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత నియోజకవర్గ సమస్యలను సీఎం, మంత్రుల దృష్టికి తీసుకెళ్లాం. డివిజన్లలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను శాశ్వతంగా పరిష్కారం చేసే దిశగా చర్యలు చేపట్టాం.

ఆంధ్రజ్యోతి: ఎన్నికలప్పుడే నవీన్ యాదవ్ కనిపిస్తారు. మిగిలిన సమయాల్లో అందుబాటులో ఉండరన్న ఆరోపణలపై..?

నవీన్‌యాదవ్: ఇది కరెక్ట్ కాదు. ఈ నియోజకవర్గంలోని ప్రజలకు తెలుసు. నేను ఇక్కడే పుట్టి పెరిగినోడిని. మా ఆఫీసు కానీ, ఇళ్లు నియోజకర్గంలోనే ఉన్నాయి. పొద్దున లేస్తే ఇక్కడి ప్రజలు మా ఇంటికి వస్తారు. మా నాన్న 40 ఏళ్ల కిందటే కాంగ్రెస్ పార్టీ కార్యకర్తగా, పీజేఆర్‌కు కుడిభుజంగా ఎదిగారు. ఎన్నో ఏళ్లుగా నవయువ నిర్మాణ్ స్వచ్ఛంద సంస్థ ద్వారా సేవ కార్యక్రమాలు చేపడుతున్నా. తాము బీఈడీ, డీఈడీ చదివిన నిరుద్యోగులకు డీఎస్సీ శిక్షణ ఇప్పించగా, ఇప్పటి వరకు 30 మంది వరకు ప్రభుత్వ టీచర్లయ్యారు. పోలీసు కోచింగ్‌లో మరికొందరూ కానిస్టేబుళ్లుగా ఎంపికయ్యారు.

ఆంధ్రజ్యోతి: నియోజకవర్గానికి ఇన్చార్జిగా ఉన్న ముగ్గురు మంత్రుల మద్దతు మీకు లేదని ప్రచారం జరుగుతోంది?

నవీన్‌యాదవ్: అది అసలు నిజం కాదు. నాకు వారి సంపూర్ణ మద్దతు ఉంది. వారి ఫీడ్‌బ్యాక్ లేకుండా నాకు టికెట్ వస్తుందా.

ఆంధ్రజ్యోతి: మీ నాన్న రౌడీషీటర్ ముద్రపై ప్రత్యర్థులు చేస్తున్న ప్రచారాన్ని ఎలా అధిగమించనున్నారు?

నవీన్‌యాదవ్: బీఆర్ఎస్ కానీ, ఆ పార్టీ నేతలు కానీ కాంగ్రెస్ పార్టీని కాదు, మా కుటుంబాన్ని ఎదుర్కోలేక ఇలాంటి దుష్ప్రచారం చేస్తున్నారు. అదే బీఆర్ఎస్ పార్టీ 2018 అసెంబ్లీ ఎన్నికల్లో, 2023 ఎన్నికల్లో మా కుటుంబానికి టికెట్ ఇస్తామని ఏవిధంగా హామీ ఇచ్చింది. నవీన్‌యాదవ్‌కు ప్రజల్లో, యువతలో ఉన్న పలుకుబడిని చూసి వాళ్లకు ఓటమి భయం పట్టుకుంది. నేను క్లీన్ ఈమేజ్ కలిగిన వ్యక్తిని. నాపై కూడా నిన్నటి నుంచి సోషల్‌మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారు. ఎన్నో తప్పులు వాళ్ల చేసి, వాటిని మా కుటుంబంపై రుద్దడం సరికాదు.

ఆంధ్రజ్యోతి: హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా ఉన్న మాగంటి ఫ్యామిలీ నుంచి బరిలోకి దిగే అభ్యర్థిని ఎలా ఎదుర్కోనున్నారు?

నవీన్‌యాదవ్: నియోజకవర్గ అభివృద్ధి ఏ మేరకు చేశామనేది గీటురాయి. మా కుటుంబం 1978 నుంచి పదవులు లేకుండా ప్రజలకు అండగా నిలబడినాం. ఎన్నో బస్తీలు, కాలనీల ఏర్పాటులో భాగమయ్యాం. పీజేఆర్‌కు కుడిభుజంగా ఉన్న కుటుంబం మాది. మా పలుకుబడి చూసి బీఆర్ఎస్‌కు ఓటమి భయం పట్టుకుంది.

ఆంధ్రజ్యోతి: మీ స్టార్ క్యాంపెయినర్ ఎవరు?

నవీన్‌యాదవ్: సీఎం రేవంత్‌రెడ్డి. రాష్ట్ర మంత్రులు, పార్టీ నేతలు, కార్యకర్తలు. కాంగ్రెస్ సంక్షేమ పథకాలతో లబ్ధి పొందుతున్న ప్రతీ ఒక్కరూ మా స్టార్ క్యాంపెయినర్లే.

ఆంధ్రజ్యోతి: అభ్యర్థి ప్రకటనలో ఆలస్యంతో ప్రచారంలో వెనుకపడినట్లున్నారు?

నవీన్‌యాదవ్: అభ్యర్థిగా ప్రకటన ఆలస్యమైనా ప్రచారం ఎక్కడా వెనుకబడలేదు. నవ యువ నిర్మాణ్ స్వచ్ఛంద సంస్థ ద్వారా సేవ కార్యక్రమాలను కొనసాగిస్తున్నా. ప్రజల్లోనే, ప్రచారంలోనే ఉన్నాం.

ఆంధ్రజ్యోతి: గతంలో మీ ఫ్యామిలీతో సన్నిహితంగా ఉన్న పీజేఆర్.. కేసీఆర్ కుటుంబాలు ఇప్పుడు మీకు వ్యతిరేకంగా ఉన్నాయి. ఎలా అధిగమిస్తారు?

నవీన్‌యాదవ్: రాజకీయాలు కదా! వాళ్ల పార్టీకి, వాళ్లకుండే అవసరాలు వారికి ఉంటాయి. ఇప్పుడా విషయాలు గుర్తు చేసుకునే అవసరం లేదు.

ఆంధ్రజ్యోతి: రెండేళ్ల కాంగ్రెస్ ప్రభుత్వ పాలన మీ గెలుపులో ఎలాంటి పాత్ర పోషించనుంది.?

నవీన్‌యాదవ్: కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలు జూబ్లీహిల్స్ ఎన్నికల్లో పార్టీ గెలుపునకు దోహదపడనున్నాయి. హైదరాబాద్ అభివృద్ధికి ఒక విజన్‌తో ఉన్నాం. ముఖ్యంగా ఫ్యూచర్ సిటీ, మూసీనది పునర్జీవం, గోదావరి ప్రాజెక్టు పనులను ప్రభుత్వం ప్రారంభించింది. స్థానిక సంస్థలతో పాటు విద్య, ఉద్యోగావకాశాల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్‌ను కల్పించేందుకు చర్యలు చేడుతోంది. ఈ ఉప ఎన్నికలో ఒక బీసీ బిడ్డగా నాకు కాంగ్రెస్ అవకాశం కల్పించింది. ఆరు నూరైనా ఈ ఉప ఎన్నికలో గెలుపు మాదే.

మద్యం దుకాణాల లైసెన్స్‌కు

దరఖాస్తు చేసుకోవాలి

18వ తేదీ వరకు అవకాశం

చేవెళ్ల ప్రొహిబిషన్ ఎక్సైజ్ సీఐ శ్రీలత


చేవెళ్లలోని ఎక్సైజ్ కార్యాలయం

చేవెళ్ల, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): చేవెళ్ల ప్రొహిషన్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 2025-27సంవత్సరానికి మద్యం షాపుల నిర్వహణకు లైసెన్స్‌లు పొందేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని చేవెళ్ల ప్రొహిబిషన్, ఎక్సైజ్ సీఐ శ్రీలత గురువారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ.. చేవెళ్ల డివిజన్‌లో మొత్తం 27 మద్యం దుకాణాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని చెప్పారు. డివిజన్‌లో మూడు దుకాణాలను ఎస్సీ, గౌడ సామాజిక వర్గాలకు రిజర్వ్ చేశామని తెలిపారు. 24దుకాణాలకు అందరూ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మద్యం షాపును 2025 డిసెంబరు ఒకటో తేదీ నుంచి 2027 నవంబరు 30వ తేదీ వరకు నడిపించు నేలా లైసెన్స్‌ల జారీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. 21 సంవత్సరాల కంటే ఎక్కువ వయస్సు కలిగిన వారు రూ.3లక్షలు చలానా కట్టి ఈ నెల 18వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. చేవెళ్ల స్టేషన్ మద్యం దుకాణాలకు సంబంధించిన దరఖాస్తులను బండ్లగూడలోని తెలంగాణ ఎక్సైజ్ అకాడమీలో స్వీకరిస్తున్నట్టు చెప్పారు. ఆసక్తి ఉన్న వారు నిర్ణీత గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

స్థానిక ఎన్నికలకు సన్నద్ధం కావాలి

» నాయకులతో కొడంగల్ కాంగ్రెస్ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి


నాయకులు, కార్యకర్తలతో మాట్లాడుతున్న నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి

కొడంగల్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపునకు కృషి చేయాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి అన్నారు. గురువారం కొడంగల్‌లో సీఎం రేవంత్‌రెడ్డి నివాసంలో నియోజకవర్గ 8మండలాల నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ స్థానాల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాలని సూచించారు. అధిష్ఠానం టికెట్ ఎవరికి ఇచ్చినా గెలుపునకు కృషిచేయాలన్నారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. పార్టీ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవన్నారు. సమావేశంలో కాంగ్రెస్ మండలాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కాగా గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు అభ్యర్థుల ఎంపికపై కసరత్తు చేసిన నాయకులకు ఎన్నికలపై తాత్కాలిక స్టే విధిస్తూ హైకోర్టు తీర్పు ఇవ్వడంతో నాయకులు డీలా పడ్డారు. కోర్టు తీర్పు రాగానే ఎక్కడి వారు అక్కడ నిరాశకు గురయ్యారు.


ఎన్నికల ఏర్పాట్లపై సూచనలిస్తున్న ఏసీపీ లక్ష్మీనారాయణ

స్థానిక ఎన్నికలకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు

ఆమనగల్లు, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలకు పోలీసు శాఖ పరంగా పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేశామని షాద్‌నగర్ ఏసీపీ లక్ష్మీనారాయణ తెలిపారు. ఆమనగల్లు నామినేషన్ కేంద్రాన్ని గురువారం ఏసీపీ సందర్శించారు. సీఐలు శ్రీనివాస్‌రెడ్డి, జానకిరామ్‌రెడ్డి, ఆర్వో మాధురిని ఏర్పాట్లపై అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవన్నారు. గతంలో అల్లర్లు జరిగిన గ్రామాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. ఆయన వెంట ఎస్ఐ వెంకటేశ్ ఉన్నారు.

వాహనాల తనిఖీ


మొయినాబాద్ హైదరాబాద్-బీజాపూర్ రహదారిపై తనిఖీలు చేస్తున్న పోలీసులు

మొయినాబాద్ రూరల్, అక్టోబరు 9(ఆంధ్యజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ మొదలవడంతో పోలీసులు వాహన తనిఖీలను విస్తృతం చేశారు. రెండు రోజులుగా హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారి కూడల్లో చేవెళ్ల ఏసీపీ కిషన్‌గౌడ్, మొయినాబాద్ సీఐ పవన్‌పవన్‌కుమార్‌రెడ్డిల ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. రూ.50వేలకు మించి నగదును తరలింకూడదని సీఐ పేర్కొన్నారు. కార్యక్రమంలో పోలీసులు సిబ్బంది పాల్గొన్నారు.


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న మధుసూదన్‌రెడ్డి

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు

షాబాద్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిషత్తు ఉంటుందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఏఎంఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో షాబాద్‌లోని పీఆర్ఆర్ మినీ స్టేడియంలో నిర్వహిస్తున్న 69వ మండల స్థాయి ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ జూనియర్, సీనియర్ లెవల్ క్రీడాపోటీలను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మధుసూదన్ రెడ్డి విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని, గ్రామీణ క్రీడాకారుల్లో ప్రతిభను వెలికితీసేందుకు ఏఎంఆర్ ట్రస్ట్ ఎంతో కృషి చేస్తుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ కావలి చంద్రశేఖర్, మాజీ ఎంపీటీసీలు కుమ్మరి చెన్నయ్య, వెంకట్‌రెడ్డి, అశోక్, మాజీ సర్పంచులు జనార్దన్‌రెడ్డి, రవీందర్‌నాయక్, నర్సింహులు, శ్రీనివాస్‌గౌడ్, లింగం, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, సంజీవరెడ్డి, నర్సింహారావు, రాహుల్, శేఖర్, కృష్ణారెడ్డి, కిషోర్, యాదయ్య, రఫీక్, మహేష్, రమేష్, శ్రీనివాస్, సూర్యగౌడ్, రఘు, విజయ్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

కేశంపేట, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రీడల్లో రాణించాలని కేశంపేట సీఐ నరహరి అన్నారు. గురువారం కేశంపేట మండల కేంద్రంలో 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో మంచి భవిష్యత్ ఉండదని సూచించారు. రెండు రోజులపాటు క్రీడాపోటీలు కొనసాగుతాయని, విద్యార్థులు తమ ప్రతిభ చాటుకునే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ టీ.రాజేందర్‌రెడ్డి, ఎంపీడీవో రవిచంద్రకుమార్ రెడ్డి, ఇన్‌చార్జి ఎంఈవో చంద్రశేఖర్, మెడికల్ ఆఫీసర్ నిఖిత, ట్రస్మా అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, గ్లోబల్ స్కూల్ కరస్పాండెంట్ రామకృష్ణ, ఉపాధ్యాయులు శంకర్, రాజు, ఆనంద్‌బాబు, కృష్ణారెడ్డి, సీఆర్పీలు రామకృష్ణ, మల్లేశ్ వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.


కేశంపేట : పోటీలను ప్రారంభిస్తున్న సీఐ నరహరి, ఇన్‌చార్జి ఎంఈవో చంద్రశేఖర్

సర్వీస్ రోడ్లకు మోక్షమెప్పుడో?

- పట్టించుకోని ప్రజాప్రతినిధులు
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు
- జాతీయ రహదారి బైపా‌స్‌ను అనుసరించి రోడ్లు వేయని ప్రభుత్వం


బైపాస్ చటాన్‌పల్లి చౌరస్తా వద్ద సర్వీసు రోడ్డు ఇలా..


బైపాస్ కేశంపేట రోడ్డు చౌరస్తా వద్ద సర్వీసు రోడ్డు దుస్థితి


బైపాస్ కొత్తపేట రోడ్డు అండర్‌పాస్ వద్ద గోతులమయమైన సర్వీసు రోడ్డు

షాద్‌నగర్ అర్బన్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): నాలుగు లేన్ల విస్తరణలో భాగంగా నిర్మించిన 44వ జాతీయ రహదారి బైపా‌స్‌కు సర్వీసు రోడ్లు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. 2009 ఫిబ్రవరి 11న ప్రారంభమైన కొత్తూర్ నుంచి షాద్‌నగర్ మున్సిపాలిటీలోని సోలీపూర్ వైజంక్షన్ వరకు వేసిన బైపాస్ రోడ్డుకిరువైపులా సర్వీసు రోడ్లను నేటికీ నిర్మించలేదు. జాతీయ రహదారి బైపాస్ రోడ్డును నిర్మించి 16 ఏళ్లు గడుస్తున్నా.. సర్వీసు రోడ్లు వేయాలన్న ఆలోచన చేయకపోవడంతో షాద్‌నగర్, కొత్తూర్ మున్సిపాలిటీలతో పాటు నందిగామా మండల కేంద్రానికి వచ్చి వెళ్తున్న ప్రయాణీకులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. సర్వీసు రోడ్లు లేకపోవడంతో రోడ్డుకు ఇరువైపుల ఉన్న మట్టి రోడ్లపైననే వెళ్తున్న వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ప్రతీ వర్షాకాలంలో మట్టి రోడ్డుపై పెద్ద పెద్ద గోతులు ఏర్పడుతున్నాయి. బురదమయంగా మారుతున్నాయి. ఆ రోడ్లపై వెళ్లాలంటేనే భయపడుతున్నారు. ఒకవేళ ధైర్యం చేసి వెళుతున్నా వారి వాహనాలు బోల్తాపడుతున్నాయి. దాంతో సర్వీసు రోడ్లపై వెళ్లాల్సిన వారు జాతీయ రహదారిపైకి వెళ్లి ప్రమాదాలకు గురవుతున్నారు. జాతీయ రహదారి బైపా‌స్‌కు ఇరువైపులా మట్టి రోడ్లకు కనీస మరమ్మతులు చేయాలన్న ఆలోచన ఏశాఖ అధికారీ చేయడం లేదు. జాతీయ రహదారుల శాఖతో పాటు షాద్‌నగర్, కొత్తూర్ మున్సిపాలిటీలు కూడా ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ప్రతీ ఎన్నికలకు ముందు తాము గెలుపొందగానే బైపాస్ రోడ్డుకిరువైపులా సర్వీసు రోడ్లను వేయించి, ప్రయాణికుల సమస్యలను పరిష్కరిస్తామని హామీలు ఇస్తున్న పార్టీల నాయకులు విజయం సాధించిన తరువాత అటువైపు కూడా చూడడం లేదు. సర్వీసు రోడ్లపై ప్రశ్నించినా స్పందించడం లేదు. బైపాస్ సర్వీసు రోడ్ల దుస్థితి, ఇబ్బందులపై ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు స్పందించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం



జాతీయ రహదారిని అనుసరించి సర్వీసు రోడ్లను అభివృద్ధి చేయకపోవడంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నాం. వర్షాలు కురిస్తే షాద్‌నగర్ మున్సిపాలిటీలోని చటాన్‌పల్లి గ్రామస్తులు సర్వీసు రోడ్ల మీదుగా జాతీయ రహదారిపైకి, చటాన్‌పల్లి చౌరస్తాకు వెళ్లలేకపోతున్నాం. సమస్యను ఎన్నిసార్లు చెప్పినా.. ఎవ్వరు పట్టించుకోవడం లేదు. సర్వీసు రోడ్లను అభివృద్ధి చేసి, సమస్యను పరిష్కరించాలి

- ఎన్. శేఖర్, చటాన్‌పల్లి

నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి



సోలిపూర్ గ్రామస్తులు ప్రతీపనికి జాతీయ రహదారి మీదుగానే షాద్‌నగర్‌కు వచ్చిపోతుంటారు. రోడ్డుపక్కనే ఉన్న మా గ్రామస్తులు సర్వీసు రోడ్డులేక నిత్యం ప్రమాదాలకు గురై ప్రాణాలను కోల్పోతున్నారు. వర్షాకాలంలో రహదారిపైకి రా వడానికి కూడా ఇబ్బందిగా ఉంటోంది. కనీసం ఒక వైపు అయినా సర్వీసు రోడ్డును అభివృద్ధి చేయాలి.

- జీ.రాజశేఖర్‌రెడ్డి, సోలీపూర్

బిర్యాని కోసం వెళ్లి అనంత లోకాలకు..

క్రైం కార్నర్

- రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం
- డీసీఎంను బైక్‌తో ఢీకొట్టడంతో మృతి

శంషాబాద్ రూరల్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): బిర్యాని కోసమని వెళ్లిన ఓ యువకుడు ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఈ ఘటన శంషాబాద్ మండలంలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. శంషాబాద్ మండలంలోని మల్కారం గ్రామానికి చెందిన నీరటి అభిలాశ్(19) బుధవారం తన సోదరికి బిర్యాని తీసుకువచ్చేందుకు బైక్‌పై కవేలిగూడ చౌరస్తాకు వెళ్లాడు. ఈక్రమంలో రాత్రి అతడి తల్లి కాలమ్మకు వరుసకు కుమారుడైన నీరటి శ్రీనివాస్ అభిలాశ్‌కు మల్కారం పరిధిలో గల కేబీఆర్ ఫామ్ వద్ద రోడ్డు ప్రమాదం జరిగిందని సమాచారం ఇచ్చాడు. అక్కడికి వెళ్లి చూడగా అభిలాశ్ రక్తగాయాలతో పడిపోయి కనిపించాడు. కాలమ్మ ప్రమాదం ఎలా జరిగిందని తెలుసుకోగా బిర్యాని తీసుకొని వస్తుండగా కేబీఆర్ ఫామ్ వద్దకు రాగానే డీసీఎం(టీఎస్ 07 యుబీ 0362) డ్రైవర్ అజాగ్రత్తగా, అతివేగంగా ఇండికేటర్ వేయకుండా వెళ్తుండగా అభిలాశ్ డీసీఎంను వెనక నుంచి ఢీకొట్టాడని తెలుసుకుంది. అభిలాశ్ తల్లి ఫిర్యాదు మేరకు డీసీఎం డ్రైవర్ ఫయాజ్ అహ్మద్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ నరేందర్‌రెడ్డి తెలిపారు.

జీపీ కార్మికుడి బలవన్మరణం

- ఈత కొడుతూనే నీటిలో మునిగి ఆత్మహత్య
- అనారోగ్య సమస్యలే కారణం : మృతుడి భార్య
- చేవెళ్ల మండలం నావులయపల్లిలో ఘటన


బావిలోంచి మృతదేహాన్ని బయటకు తీస్తున్న ఫైర్ సిబ్బంది


బీమయ్య(ఫైల్)

చేవెళ్ల, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): అనారోగ్య సమస్యలతో బాధపడుతూ గ్రామ పంచాయతీ కార్మికుడు వ్యవసాయ బావిలో ఈతకు వెళ్లి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని నావులయపల్లి గ్రామంలో గురువారం ఉయదం చోటుచేసుకుంది. చేవెళ్ల ఎస్సై వనం శిరీష తెలిపిన వివరాల ప్రకారం.. చేవెళ్ల మండల పరిధిలోని అంతారం గ్రామ పంచాయతీ అనుబంధ గ్రామం నావులయపల్లికి చెందిన తెలుగు బీమయ్య(58) అంతారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో కార్మికుడిగా పని చేస్తున్నాడు. అయితే అతడు కొంతకాలంగా చెవినొప్పితో పాటు ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. ఈక్రమంలో గురువారం ఉదయం 9 గంటలకు ఆసుపత్రికి వెళ్తున్నట్లు చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. తిరిగి ఉదయం 10 గంటలకు ఇంటికి సైకిల్‌పై వచ్చి గ్రామంలో ఉన్న రాములుగౌడ్ వ్యవసాయ బావిలో ఈతకు వెళ్తున్నట్లు భార్య అంజమ్మతో చెప్పాడు. ఈ సమయంలో ఈతకు ఎందుకు వెళ్తున్నావని అంజమ్మ మందలించగా.. వినిపించుకోకుండా వెళ్లిపోయాడు. కొద్దిసేపు బావిలో ఈత కొట్టిన బీమయ్య అనంతరం ఒక్కసారిగా నీటిలో మునిగిపోయాడు. కాగా, అప్పటికే అతడి వెనకాల బావి వద్దకు వెళ్లిన భార్య అంజమ్మ కేకలు వేయడంతో చుట్టుపక్కలవారు వచ్చి ఫైర్ సిబ్బందికి సమాచారం అందించడంతో మృతదేహాన్ని బావినుంచి బయటకు తీశారు. కాగా, మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. అయితే, చెవినొప్పితో పాటు అనారోగ్య సమస్యల వల్లనే తన భర్త బలవన్మరణానికి పాల్పడినట్లు అంజమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు పోలీస్‌లు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బెల్ట్‌షాప్ నిర్వాహకులు, రౌడీషీటర్ల బైండోవర్

ఆదిభట్ల/యాచారం, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): యాచారంలోని వివిధ గ్రామాల్లో 27 మంది బెల్ట్‌షాప్ నిర్వాకులను గురువారం ఎమ్మార్వో అయ్యప్ప ఎదుట బైండోవర్ చేశామని సీఐ నందీశ్వర్‌రెడ్డి తెలిపారు. గడ్డమల్లయాగూడలో 8మంది, కొత్తపల్లిలో ఆరుగురు, చింతపట్లలో ఇద్దరు, భానుతండాలో ఒకరు, చౌదర్‌పల్లిలో ఒకరు, తక్కల్లపల్లిలో 9 మందిని బైండోవర్ చేశామన్నారు. కాగా, హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్ పరిధిలోని మేడిపల్లిలో ఇద్దరు రౌడీషీటర్లను, కుర్మిద్దలో ఒకరు, సార్లపల్లిలో ఇద్దరు, మీర్‌ఖాన్‌పేట్‌లో ఇద్దరు, మాలగూడలో ఒకరిని యాచారం తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశామని సీఐ సత్యనారాయణ తెలిపారు.

కాలనీలో సమస్యలు పరిష్కరించాలి


కమిషనర్ శంకర్ నాయక్‌కు వినతిపత్రం ఇస్తున్న లక్ష్మణ్, కాలనీవాసులు

ఆమనగల్లు, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు మున్సిపాలిటీ 15వ వార్డులో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కాలనీ వాసులు మున్సిపల్ కమిషనర్ శంకర్ నాయక్‌ను కోరారు. గురువారం మాజీ కౌన్సిలర్ చెక్కాల లక్ష్మణ్ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. కాలనీకి మురుగు కాల్వలు మంజూరై ఏడాది గడిచినా నేటికీ పనులు చేపట్టడం లేదని, మురుగు నీరు రోడ్లపై ప్రవహించి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. వీధిలైట్లు లేక రాత్రివేళల్లో ఇబ్బందులు పడుతున్నామని వారు తెలిపారు. అదేవిధంగా పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని అభ్యర్థించారు. వినతిపత్రం అందజేసిన వారిలో పున్న వెంకటేశ్, సుగుణ, పార్వతి, పద్మ, బాలకృష్ణ, తదితరులు ఉన్నారు.

తొలి విడత ఎన్నికల నోటిఫికేషన్ల ప్రదర్శన

ఆమనగల్లు/మహేశ్వరం/చేవెళ్ల/శంషాబాద్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల నేపథ్యంలో ఆమనగల్లు మండలంలో అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. మండల పరిషత్ నోటీస్ బోర్డు ఎదుట గురువారం ఎంపీటీసీ ఎన్నికల నోటిఫికేషన్‌ను ఆర్వో మాధురి, జెడ్పీటీసీ ఎన్నికల నోటిఫికేషన్‌ను ఆర్వో శోభారాణిలు ప్రదర్శించారు. నామినేషన్ల స్వీకరణకు మండల పరిషత్ కార్యాలయంలో వేర్వేరుగా కౌంటర్లు ఏర్పాటు చేశారు. సీఐలు జానకి రాంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ఐ వెంకటేశ్‌ల ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాట్లు చేశారు. కాగా, కడ్తాల్ మండలంలో పది ఎంపీటీసీ స్థానాలకు గాను చెల్లంపల్లి ఎంపీటీసీ స్థానానికి బాలాజీ నగర్ తండాకు చెందిన రాత్లావత్ కృష్ణ కాంగ్రెస్ తరఫున నామినేషన్ దాఖలు చేసినట్లు ఆర్‌వో సుజాత తెలిపారు. తలకొండపల్లి మండలంలో 12 ఎంపీటీసీ స్థానాలకు గాను మొదటిరోజు రాంపూర్ ఎంపీటీసీ స్థానానికి కాంగ్రెస్ తరఫున కాకి కృష్ణ నామినేషన్ దాఖలు చేసినట్లు ఆర్వో శ్రీకాంత్ తెలిపారు. కాగా, స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియలో భాగంగా నామినేషన్ల స్వీకరణకు అధికారులు మహేశ్వరంలో అన్ని ఏర్పాట్లు చేశారు. చేవెళ్ల డివిజన్‌లో అధికారులు అన్ని మండల పరిషత్ కార్యాలయాల్లో ఏర్పాట్లు చేశారు. చేవెళ్ల, షాబాద్, శంకర్‌పల్లి, మొయినాబాద్ తదితర మండలాల్లో మొత్తం 45 ఎంపీటీసీ స్థానాలకు, నాలుగు జెడ్పీటీ స్థానాలకుగాను నామినేషన్లు స్వీకరించాలని ఆదేశాలు రావడంతో అన్ని మండలాల్లో అధికారులు పూర్తి చేశారు. పోలీస్‌లు బందోబస్తు ఏర్పాటు చేశారు. నామినేషన్లు వేసేందుకుగాను వివిధ పార్టీల నాయకులు దరఖాస్తు ఫారాలు తీసుకెళ్లినట్లు అధికారులు తెలిపారు. అదేవిధంగా శంషాబాద్‌లో ఎంపీటీసీ అభ్యర్థులు 9 మంది అభ్యర్థులు నామినేషన్ ఫారాలు తీసుకెళ్లగా.. జెడ్పీటీసీకి ఇద్దరు అభ్యర్థులు తీసుకెళ్లినట్లు ఎంపీడీవో మున్ని తెలిపారు. శంషాబాద్ మండలంలో మొత్తం 9ఎంపీటీసీ స్థానాలు ఒక జడ్పీటీసీ స్థానానికి ఎన్నికలు నిర్వహించనున్నట్టు తెలిపారు.


ఎన్నికల నామినేషన్ల సందర్భంగా చేవెళ్ల పట్టణ కేంద్రంలో ఏర్పాటు చేస్తున్న అధికారులు

పెంచిన బస్సు చార్జీలను తగ్గించాలి : బీఆర్ఎస్


ఆమనగల్లు : నిరసన ర్యాలీలో బీఆర్ఎస్

ఆమనగల్లు/కడ్తాల్/శంకర్‌పల్లి/కొత్తూర్/చౌదరిగూడ, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): పెంచిన ఆర్టీసీ బస్సు చార్జీలను వెంటనే తగ్గించాలని కోరుతూ గురువారం బీఆర్ఎస్ చలో బస్ భవన్ ధర్నాకు పిలుపునివ్వడంతో పోలీసులు నాయకులు, కార్యకర్తలను ముందస్తు అరెస్టు చేశారు. ఆమనగల్లు పట్టణంలో బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు నేనావత్ పత్యనాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. బీఆర్ఎస్ జెండాలు చేబూని స్థానిక రాజీవ్ చౌక్‌వద్ద హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై ధర్నా నిర్వహించారు. రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బస్టాండ్‌లో బస్సుల్లో ఎక్కి చార్జీల పెంపు, కాంగ్రెస్ విధానాలను ప్రయాణికులకు వివరించారు. అనంతరం నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించి సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. మున్సిపాలిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ చుక్క నిరంజన్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు. బస్ చార్జీలను వెంటనే తగ్గించాలని కోరుతూ కడ్తాల ప్రధాన రహదారిపై బీఆర్ఎస్ నాయకులు నిరసన ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈమేరకు వారిని పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. మాజీ జడ్పీటీసీ దశరథ్ నాయక్, వైస్ ఎంపీపీ ఆనంద్, నాయకులు కడారి రామకృష్ణ, పంతూనాయక్, సేవ్యనాయక్, తులసీరామ్‌నాయక్, హరిచంద్‌నాయక్,భూనాథ్, సాయిలు, తదితరులు ఉన్నారు. బీఆర్ఎస్ శంకర్‌పల్లి మండలాధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డిని చందానగర్ పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. బస్సు చార్జీల పెంపుతో సామాన్య ప్రజలు, విద్యార్థులపై పెనుభారం పడుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే కొత్తూర్ బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ డోలీ రవీందర్, కౌన్సిలర్లు మాదారం నర్సింహగౌడ్, సోమ్లానాయక్, కోస్గి శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు కడెంపల్లి శ్రీనివాస్‌గౌడ్, బి.దేవేందర్‌యాదవ్, పెంటనోళ్ల యాదగిరి, మెండె కృష్ణ, జంగగళ్ల కృష్ణయ్య, రాజేందర్‌గౌడ్, గోపాల్‌గౌడ్, జె. శ్రీను, శ్రీరాములుయాదవ్, గోపాల్‌నాయక్ తదితరులు అరెస్ట్ అయిన వారిలో ఉన్నారు. అలాగే చౌదరిగూడ మండల బీఆర్ఎస్ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు హఫీజ్ మాట్లాడుతూ.. బస్సు చార్జీలు పెంచడం సరికాదని, పేద ప్రజలపై భారాన్ని వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. అరెస్టు అయినవారిలో బాబురావు, వెంకటేష్, జబ్బార్, మోత్య, సత్యం, శేఖర్, రాములు, శివరాజ్, అంజి తదితరులు పాల్గొన్నారు.


కొత్తూర్ : పోలీసుల అదుపులో నాయకులు

అందుబాటులో లేని చౌదరిగూడ ఏపీఎం

- విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణ


చౌదరిగూడ మహిళా సమాఖ్య కార్యాలయంలో ఖాళీగా ఏపీఎం కుర్చీ

చౌదరిగూడ, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన అధికారి చుట్టపుచూపుగా కార్యాలయానికి వచ్చిపోతున్నాడు. దాదాపు మూడు నెలల క్రితం విధుల్లో చేరినప్పటికీ వారంలో ఒకటి, రెండు సార్లు మాత్రమే వచ్చిపోతున్నారు. జిల్లేడు చౌదరిగూడ మండలంలోని మహిళా సమాఖ్య కార్యాలయంలో ఏపీఎం హరిలాల్ కొంత కాలంగా విధులు నిర్వహిస్తున్నాడు. కానీ, కార్యాలయంలో ఉప్పుడూ అందుబాటులో ఉండటం లేదని పలువురు స్థానికులు ఆరోపిస్తున్నారు. కొందుర్గు మండల ఇన్‌చార్జిగా కొనసాగడంతో.. అక్కడేమైనా ఉన్నాడా? అని ఆరాతీస్తే అక్కడ కూడా అందుబాటులో లేరు. ఈ విషయమై ఆయన్ను గురువారం ఫోన్‌లో సంప్రదించగా అందుబాటులోకి రాలేదు.

సామీ.. సౌకర్యాల లేమి?

(ఐదో పేజీ తరువాయి)


మధ్యలోనే నిలిచిపోయిన రాజగోపురం నిర్మాణ పనులు

అన్ని సౌకర్యాలతో కల్యాణ మండపం నిర్మించేందుకు ముందుకు వచ్చారు. సుమారు రూ.60 లక్షల నుంచి రూ.70 లక్షలతో నిర్మాణం చేసేందుకు సంకల్పించారు. సుమారు నాలుగు వందల గజాలకు పైగా స్థలంలో నిర్మాణం చేపట్టి మొదటి స్లాబ్ కూడా వేశారు. అయితే అంతకుముందు ఉన్న ప్రహరీ కూలీ ఒక వ్యక్తి తీవ్రంగా గాయపడటంతో దాతనే ఆసుపత్రిలో చేర్పించి వైద్యం చేయించారు. కానీ అతను చికిత్స పొందుతూ మృతి చెందాడు. దాంతో మృతుడి కుటుంబ సభ్యులు కల్యాణ మండపం నిర్మాణం జరుగకుండా అడ్డు తగులుతున్నారు. దేవాదాయ శాఖ ద్వారా ఆలయంలో అతడి భార్యకు స్వీపరుగా ఉద్యోగం ఇస్తామని చెప్పినా ఆమె కుటుంబ సభ్యులు ఒప్పుకోవడం లేదంటున్నారు. వారితో చర్చించి మాట్లాడితే సమస్య పరిష్కారం అవుతుంది. కానీ ఎవరూ చొరవ తీసుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి.

నిలిచిన రాజగోపురం పనులు

వందల ఏళ్ల చరిత్ర కలిగిన రామేశ్వరం శివాలయంలో ఇప్పటివరకు రాజగోపురం లేదు. హైదరాబాద్‌కు చెందిన మరో భక్తుడు రాజగోపురం నిర్మాణానికి ముందుకు వచ్చాడు. నిర్మాణం పనులు సగం వరకు జరిగిన తర్వాత అతను మృతి చెందాడు. దాంతో పనులు నిలిచి పోయాయి. అయితే, రాజగోపురం పనులను కూడా పూర్తి చేసేందుకు కల్యాణ మండపం నిర్మిస్తున్న దాత సిద్ధంగా ఉన్నారని ఆలయ ఈవో శివకుమార్ తెలిపారు. అధికారులు చొరవ తీసుకుని వాటి నిర్మాణ పనులు జరిగేలా చూడాలని భక్తులు కోరుతున్నారు.

ప్రజావిశ్వాసం కోల్పోయిన కాంగ్రెస్

కడ్తాల్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రజావిశ్వాసం కోల్పోయిన కాంగ్రె‌స్‌కు స్థానిక సంస్థల ఎన్నికల్లో ఘోర పరాభవం తప్పదని మాజీ జడ్పీటీసీ, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు జర్పుల దశరథ్‌నాయక్ అన్నారు. కడ్తాల మండలం గడ్డమీదితండాకు చెందిన కాంగ్రెస్ పార్టీ మాజీ వార్డుసభ్యుడు అమ్యనాయక్ తన అనుచరులతో గురువారం దశరథ్‌నాయక్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. మాజీ వైస్‌ఎంపీపీ ఆనంద్, సర్పంచ్‌లు తులసీరామ్‌నాయక్, హరిచంద్‌నాయక్, భూనాథ్, మాజీ ఎంపీపీ సువాలిపంతూ, కడారి రామకృష్ణ, నాయకులున్నారు.


కడ్తాల్ : అమర్యనాయక్, దశరథ్‌నాయక్‌లకు కాంగ్రెస్ కండువా కప్పి స్వాగతిస్తున్న శ్రీనివాస్‌గౌడ్

ఉనికి కోసం విపక్షాల కుట్ర రాజకీయాలు

ప్రజావిశ్వాసం కోల్పోయి అధికారానికి దూరమైన బీఆర్ఎస్ నాయకులు రాజకీయ ఉనికి కోసం కుట్ర రాజకీయాలు సాగిస్తున్నారని టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. కడ్తాల మండలం వెలుగురాళ్ల తండాకు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు దశరథ్ నాయక్ తన అనుచరులతో కలిసి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీచ్యనాయక్, డీసీసీ ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్‌ల ఆధ్వర్యంలో శ్రీనివాస్‌గౌడ్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. అదేవిధంగా బీఆర్ఎస్ పార్టీలో చేరిన గడ్డమీది తండాకు చెందిన అమర్య నాయక్ తిరిగి శ్రీనివాస్‌గౌడ్ సమక్షంలో సొంతగూటికి చేరారు. డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ భాస్కర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

బీసీ వ్యతిరేక పార్టీలకు గుణపాఠం తప్పదు

బీసీ వ్యతిరేక పార్టీలైన బీజేపీ, బీఆర్ఎస్‌లకు తగిన గుణపాఠం తప్పదని పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. కడ్తాల మండలం మైసిగండిలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించి కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపితే బీజేపీ ప్రభుత్వం పార్లమెంట్‌లో ఆమోదించకుండా, 9వ షెడ్యూల్‌లో చేర్చకుండా కాలయాపన చేస్తుందని శ్రీనివాస్‌గౌడ్ మండిపడ్డారు. హైకోర్టు సూచించిన విధంగా రెండు వారాల్లోపు విపక్ష పార్టీలు తమ తమ అభిప్రాయాలు కోర్టుకు తెలిపి బీసీ రిజర్వేషన్లు అమలయ్యేలా ప్రభుత్వంతో కలిసి రావాలని ఆయన కోరారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

ఆమనగల్లు : కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని, పేదలకు మేలు జరుగుతుందని ఆ పార్టీ జిల్లా నాయకుడు ఎగిరిశెట్టి సత్యం అన్నారు. ఆమనగల్లు మండలం శెట్టిపల్లికి చెందిన పలువురు బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు సత్యం ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి, పేదల ఆత్మగౌరవం పెంపే ధ్యేయంగా సీఎం రేవంత్‌రెడ్డి పథకాలు రూపొందించి అమలు చేస్తున్నట్లు చెప్పారు. పార్టీలో చేరినవారిలో శెట్టిపల్లి వెంకటయ్య, జంగయ్య, తదితరులు ఉన్నారు.


ఆమనగల్లు : పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పుతున్న ఎగిరిశెట్టి సత్యం

బీసీ రిజర్వేషన్లను చట్టపరంగా అమలు చేయాలి

- కొత్తూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య



కొత్తూర్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను చట్టపరంగా అమలు చేయాలని స్థానిక మున్సిపల్ చైర్‌పర్సన్ బాతుక లావణ్యదేవేందర్‌యాదవ్ పేర్కొన్నారు స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్‌పై హైకోర్టు స్టే విధించడంపై చైర్‌పర్సన్ స్పందించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బీసీలను మోసం చేయడానికి ఇది మరో నిదర్శనమన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు జరగవద్దనే ఉద్దేశంతో ప్రభుత్వం ఓ నాటకం ప్రదర్శించిందని ఆరోపించారు. రిజర్వేషన్లపై అసెంబ్లీలో తీర్మానం చేసి, పార్లమెంట్‌లో ప్రవేశపెట్టించి చట్టపరంగా తీసుకవస్తే ఎలాంటి అడ్డంకులు రావన్నారు. చట్టపరమైన రిజర్వేషన్లు లేకుండా ఎన్నికల హడావుడి నిర్ణయించడం సరికాదన్నారు.